ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఓటర్లకు అసౌకర్యం కలగకుండా సన్నాహాలు
- ఓటరు కార్డు లేకపోయినా ఓటు వేసే అవకాశం
- గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మారెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

గాజువాక : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిలబడటం కోసం నీడను ఏర్పాటు చేయడం మొదలుకుని అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఎవరికైనా ఓటరు స్లిప్పులు అందకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్లిప్పులు లేకపోయినా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు. సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలన్నీ కల్పించాం. మినరల్ వాటర్, ఫ్యాన్లు, లైట్లు, ఫర్నిచర్ సమకూర్చాం. టాయిలెట్లు ఏర్పాటు చేశాం. దివ్యాంగులకు ర్యాంపులు పెట్టి, ట్రైసైకిళ్లు అందుబాటులో ఉంచాం. అంధులకు బ్రెయిలీ లిపిలో బ్యాలెట్ షీట్ ఉంది.

అందుబాటులో అత్యవసర సేవలు

ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ లైన్ ఏర్పాటు చేశాం. మెడికల్ క్యాంపులు ఉంటాయి. ఏఎన్ఎం, ఆశ వంటి సిబ్బంది ఉంటారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంటాయి. శానిటరీ సిబ్బందిని నియమించాం. నియోజకవర్గంలోని 306 పోలింగ్ కేంద్రాలకు గాను 241 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశాం. ఓటింగ్ జరుగుతున్నంతసేపు లైవ్ స్ట్రీమింగ్ అవుతుంది. వెబ్ కాస్టింగ్ లేనిచోట వీడియో కవరేజి ఏర్పాటు చేశాం.

సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు

నియోజకవర్గంలో 3,33,611 మంది ఓటర్లున్నారు. పోలింగ్ కేంద్రాలు 306 ఉన్నాయి. ఇందులో 83 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించాం. సాధారణ పోలింగ్ కేంద్రం వద్ద రెగ్యులర్ పోలీసులు ఉంటారు. సమస్యాత్మక కేంద్రాలవద్ద అదనపు పోలీసు బలగాలతో పాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కూడా బందోబస్తు నిర్వహిస్తాయి.

ఓటరు జాబితాలో పేరు ఉంటే చాలు

ఓటరు కార్డు లేకపోయినా జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటరు తనకు సంబంధించిన ఏదో ఒక రుజువు (ప్రూఫ్) చూపించాలి. ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తదితర ఆధారాలను చూపించి, ఓటు హక్కు ఉపయోగించుకోవచ్చు.

స్లిప్పులు అందకున్నా..కంగారు వద్దు

స్లిప్పులు అందని ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలను కలిస్తే ఓటు వేయడానికి అవసరమైన సహాయం చేస్తారు. డయల్ 1950కి కాల్ చేసి ఓటర్లు వివరాలు తెలుసుకుని ఓటు వేయవచ్చు. అది కూడా కానిపక్షంలో మా కంట్రోల్‌రూమ్‌కి వచ్చి తెలుసుకోవచ్చు. లేదా, బీహెచ్ఏ యాప్ ద్వారా ఓటర్లు వివరాలను పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు.

అప్పుడు మాత్రమే ఛాలెంజ్ ఓటుకు అవకాశం

పాత ఓటరు కార్డును కలిగి ఉండి, జాబితాలో పేరు లేకపోతే ఓటు ఉన్నట్టు కాదు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఆ ఓటును వేరే వ్యక్తులు వేసినప్పుడు మాత్రమే ఒరిజినల్ ఓటరు చాలెంజ్ ఓటు వేయడం కుదురుతుంది. అంతేతప్ప పాత ఓటరు కార్డును చూపించి చాలెంజ్ ఓటు వేయడానికి వీల్లేదు.

ఓటర్లకు సమీపంలోనే పోలింగ్ కేంద్రాలు

గాజువాక నియోజకవర్గంలో ఏ ఓటరుకు తన పోలింగ్ కేంద్రం దూరంగా లేదు. ఎటు చూసినా కిలోమీటరు దూరంలోనే ఉంది. రేషనలైజేషన్‌ను సైంటిఫిక్‌గా చేయడంవల్ల సమస్యలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పోలింగ్ కేంద్రాలను నిర్ణయించాం.

ఉదయం 5గంటలకే పోలింగ్ ఏజెంట్లు రావాలి

పోలింగ్ ఏజెంట్లు ఆ రోజు ఉదయం 5 గంటలకు కేంద్రానికి రావాలి. ముందుగానే మాక్ పోలింగ్ పూర్తి చేసి, నిర్ణీత సమయానికి ఓటింగ్ మొదలుపెట్టవచ్చు.

ఎన్నికల విధుల్లో 1836 మంది సిబ్బంది

ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బంది ఉంటారు. మొత్తం 1836 మంది సిబ్బందిని ఉపయోగిస్తున్నాం. 306 మంది పీవోలు, మరో 306 మంది ఏపీవోలతో పాటు రిజర్వులో 20 శాతం మంది సిబ్బంది ఉంటారు. 150 మైక్రో అబ్జర్వర్లు, 241 వెబ్ కాస్టింగ్ అసిస్టెంట్లు, 65 మంది వీడియో గ్రాఫర్లు, 105 వాహనాలు, డ్రైవర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు.

గాజువాకలో ఫ్యాన్ జోరు

అమర్‌కు ప్రజామద్దతు



- బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా అనుభవం
- నియోజకవర్గంపై పూర్తి అవగాహన
- గత ఐదేళ్ల సంక్షేమ పాలన, అభివృద్ధి
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మద్దతు
- గాజువాకను ఆదర్శంగా నిలిపేలా ప్రత్యేక ప్రణాళిక

ఇదీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ బలం

పల్లా ఎదురీత



- బినామీల పేరుతో భూ కబ్జాలు
- ప్రజలను పట్టించుకోరు
- ప్రజా సమస్యలపై పర్యటించిన సందర్భాలే లేవు
- సిఫార్సులకే ప్రాధాన్యం
- సొంత పార్టీ నాయకుల నుంచే వ్యతిరేకత
- పట్టించుకోని కూటమి పార్టీలు

ఇదీ టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు పరిస్థితి



గాజువాక : సార్వత్రిక ఎన్నికల తేదీ రానే వచ్చింది. మరో 24 గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఈ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్.. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఇండియా కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా ఎం.జగ్గునాయుడు సహా మొత్తం 14 మంది బరిలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం కూడా పూర్తయి పోలింగ్ మాత్రమే మిగిలి ఉండటంతో గాజువాక ఎవరి సొంతం కానుందన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో సంక్షేమం, అభివృద్ధి పథకాల అమలుతో పాటు తమకు అందుబాటులో ఏ నాయకుడు ఉంటారనే విషయంపై ప్రజలు బేరీజు వేసుకుంటున్నారు. నియోజకవర్గానికి ప్రస్తుతం (2019–24) వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండగా, అంతకుముందు (2014–19) టీడీపీ గెలుపొందింది. ఈ రెండు పార్టీల కాలంలో జరిగిన అభివృద్ధితో పాటు తమకు అందిన సంక్షేమం, అందుబాటులో ఉన్న నాయకుడు వంటి అంశాలను ప్రజలు పోల్చి చూసుకుంటున్నారు.

అభివృద్ధి, సంక్షేమం, కుటుంబ నేపథ్యంపై అమర్ ఆశలు

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు బాగా చేరువైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల 70వేల కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేసిన ప్రభుత్వం గాజువాక నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సారథ్యంలో రూ.2వేల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, రూ.500 కోట్ల అభివృద్ధి పథకాలను అమలు చేసింది. దీంతో పాటు గాజువాక దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న హౌస్ కమిటీ పట్టాలకు హక్కులు కల్పించడంతోపాటు అనేక సమస్యలను సైతం పరిష్కరించింది. ఈ విషయాలన్నీ తనకు లాభిస్తాయని అమర్‌నాథ్ ధీమాగా ఉన్నారు. దీంతోపాటు ఆయనకు తన కుటుంబం నేపథ్యం కూడా బాగా కలిసొచ్చే అంశంగా పరిశీలకులు పేర్కొంటున్నారు. గాజువాకలో బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన అమర్‌నాథ్ రాజకీయ నేపథ్యం కలిగిన గుడివాడ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. తాత గుడివాడ అప్పన్న ఎమ్మెల్యేగా, తండ్రి గుడివాడ గురునాథరావు మంత్రిగా ఈ ప్రాంత రాజకీయాల్లో బలమైన ముద్ర వేసుకున్నారు. ఆ కుటుంబానికి విధేయత కలిగిన అభిమానులు సైతం వేల సంఖ్యలో ఉన్నారు. తనను గెలిపిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణతో పాటు గాజువాక అభివృద్ధికి తాను చేయబోయే కృషికి సంబంధించి ఆయన విడుదల చేసి స్థానిక మేనిఫెస్టో అందర్నీ ఆకర్షించింది. వీటితో పాటు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు తనను గెలిపిస్తాయనే ధీమాతో అమర్‌నాథ్ ఉన్నారు.

పల్లాకు తప్పని ఇంటిపోరు

మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగారు. గాజువాకలో యాదవ సామాజికవర్గానికి చెందిన ఆయన కూడా రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచే రాజకీయల్లోకి వచ్చి 2014లో గాజువాక ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ అయిదేళ్ల కాలంలో రెవెన్యూ అధికారులను, బినామీలను అడ్డం పెట్టుకుని పలు భూకబ్జాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ఆ కాలంలోనే ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల ట్యాంపరింగ్ కూడా జరిగింది. అభివృద్ధి పేరుతో రోడ్లను ఎక్కడికక్కడ తవ్వేసి వదిలేశారు. ప్రభుత్వ పథకాలు ఎవరికి అందుతున్నాయన్న విషయంలో ఏనాడూ ఒక్క గడపకు వెళ్లి వివరాలు తెలుసుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలున్నాయి. సిఫార్సులకే అధిక ప్రాధాన్యం కల్పించారనే విమర్శలున్నాయి. 2019లో ఓడిపోయిన తరువాత కూడా తన పద్ధతి మార్చుకోలేదని, గాజువాకలోని తన పార్టీ కార్యాలయానికే పరిమితమయ్యారు తప్ప గడిచిన ఐదేళ్లలో ఆయన ఏ ఒక్క గ్రామంలోను ప్రజా సమస్యలపై పర్యటించిన సందర్భాలు లేవని సొంత పార్టీ నాయకులే విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం పల్లా శ్రీనివాసరావుకు మద్దతుగా ఉన్న పవన్ కల్యాణ్ కూడా గాజువాకలో పోటీ చేసి ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆయన కూడా గత ఐదేళ్లలో ఒక్కసారి వారాహి యాత్ర కోసం రావడం తప్ప గాజువాక ప్రజలను కలుసుకున్న దాఖలాలు లేవు. కూటమి తరఫున కూడా ఆయన ఇక్కడి ప్రచారానికి రాలేదు.

కూటమి నాయకులు కూడా పల్లాతో ప్రచారంలో పాల్గొన్న సందర్భాలు అరుదు. పార్టీ సీనియర్లను పల్లా పట్టించుకోవడం లేదంటూ ఆ పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న కొంతమంది నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు ఎర్రన్నాయుడికి ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రచారం కోసం కూడా ఆయన ప్రజల్లోకి అనుకున్నంత స్థాయిలో వెళ్లలేకపోయారు. చంద్రబాబు హామీలు ఇస్తున్నా గత అనుభవాల దృష్ట్యా ప్రజలు నమ్మకపోవడం పల్లాను కలవరానికి గురి చేస్తోందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ వ్యతిరేకత వైపు సీపీఎం చూపు

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రధాన అంశంగా ఇండియా కూటమి తరఫున సీపీఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఎన్నికల బరిలోకి దిగారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిన నేపథ్యంలో బీజేపీ బలపర్చిన టీడీపీ అభ్యర్థికి కార్మికవర్గం ఓట్లు వేయదన్న ధీమాతో ఉన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటే అది తమకే కలిసొస్తుందని భావిస్తున్నారు. కమ్యూనిస్టులకు, కాంగ్రెస్‌కు గల సంప్రదాయ ఓటింగ్‌తోపాటు మిగిలిన అంశాలద్వారా కలిసొచ్చే ఓటింగ్‌ను తాము సొంతం చేసుకునే విధంగా సీపీఎం ప్రచారం నిర్వహించింది. ఈ పరిస్థితులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

గాజువాక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో ప్రచారం



మహిళకు కరచాలనం ఇస్తున్న అమర్



యాదవ జగ్గరాజుపేట ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

అగనంపూడి: వైఎస్సార్‌సీపీని గెలిపించి గాజువాక అభివృద్ధికి సహకరించాలని మంత్రి, గాజువాక వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. 88వ వార్డు యాదవ జగ్గరాజుపేటలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే, గాజువాక గురించి అణువణువు తెలిసిన వ్యక్తిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఏమేం చేయాలో ప్రత్యేక ప్రణాళికను తయారు చేశానన్నారు. వాటిని అమలు చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అమర్‌నాథ్‌కు ప్రజలు అడుగడుగునా హారతులిచ్చి, స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, నమ్మి ప్రసాద్, మాడిశ రాజు, ఉరుకూటి అప్పారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు, అభిమానులు

స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు మీ చేతిలోనే..

- మీరు వేసే ఓటుతోనే అది నిర్ణయం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, అమర్‌నాథ్



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు మీరు వేసే ఓటులోనే ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శనివారం ఉదయం స్థానిక స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని అడ్డుకునేందుకు అవసరమైతే తమ పదవులను త్యాగం చేయానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అనకాపల్లి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడలేదని, దీని ప్రకారం చేస్తే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామన్న బీజేపీతో జత కట్టిన టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలువరించలేరన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలసి పోరాటం చేస్తామన్నారు. పోలింగ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉందని, ఈలోగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయబోమని ప్రధాని మోదీ ప్రకటిస్తే తాము ఈ ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల భవిష్యత్తు కన్నా తమ పదవులు గొప్పవి కాదన్నారు.

కూటమికి ఓటేస్తే ప్రైవేటీకరణకు ఆమోదం తెలిపినట్లే..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల గాజువాక సభలో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూటమికి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు ఆమోదం తెలిపినట్టే అవుతుందని, అదే వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తే స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవచ్చని చెప్పారని వారు పేర్కొన్నారు. ఇప్పటి వరకు స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతు ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కార్మికులంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నాయకులు ఉరుకూటి అప్పారావు, గొందేశి వెంకటరమణా రెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గంట్యాడ గురుమూర్తి, రెడ్డి జగన్నాథం, కర్రి ఈశ్వరరావు గొందేశి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీకి ఓటమి తప్పదు

ఉత్తరాంధ్ర గీత సహకులాల యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్

గాజువాక : గత టీడీపీ పాలకులు యాత, శెట్టిబలిజ, శ్రీ శయన, ఈడిగ సహకులాలకు అన్యాయం చేశారని ఉత్తరాంధ్ర గీత సహకులాల యువజన సంఘం అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అటు రాజకీయంగా గాని, ఇటు సామాజికంగా గాని తమ కులాలకు ప్రాధాన్యం లేకుండా చేశారన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా తమ కులాలకు సీట్లు కేటాయించకుండా అవమానించారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ తమ సామాజిక వర్గాల్లో ఒకరిని రాజ్యసభకు పంపించిందని, ఇద్దరికి మంత్రి పదవులను ఇచ్చిందని అన్నారు. మరో ఇద్దరిని శాసన మండలికి పంపిందని చెప్పారు. ఇంకో ఇద్దరికి జిల్లా పరిషత్ చైర్మన్లుగా, ఐదుగురికి కార్పొరేషన్ చైర్మన్‌లుగా, 60 మందికి డైరెక్టర్ పదవులిచ్చి గౌరవించిందన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో గీత కులస్తుల్లో ఏడుగురిని శాసన సభ అభ్యర్థులుగా, ఇద్దరికి పార్లమెంట్ అభ్యర్థులుగా సీట్లు ఇచ్చి ప్రాధాన్యం కల్పించిందన్నారు. గాజువాకలో ఒకరికి కార్పొరేటర్ సీటు కేటాయించడంతో పాటు మరో ఇద్దరిని డైరెక్టర్లుగా గౌరవించిన వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని పేర్కొన్నారు. గాజువాక నియోజకవర్గంలో గీత కులస్తులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిలకు మద్దతు ఇస్తున్నామన్నారు. గాజువాకలో కూటమికి ఓటమి తప్పదని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ఇంటక్ నాయకుడు నెల్లి అప్పలరాజు



నెల్లి అప్పలరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమర్‌నాథ్

గాజువాక : స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు నెల్లి అప్పలరాజు వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. పార్టీలో చేరిన అప్పలరాజుకు, ఆయన సోదరులకు గాజువాక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో అమలు చేయబోయే మేనిఫెస్టోతో పాటు రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలకు మరింత మేలు జరుగుతుందనే విశ్వాసంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్టు అప్పలరాజు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్ధనరావు, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఉరుకూటి అప్పారావు, నెల్లి వెంకట రమణ, నెల్లి గోవింద్, ఏకుల వెంకటేష్ గౌడ్, పోలవరపు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌కు ప్రైవేట్ కళాశాలల అధ్యాపకుల మద్దతు



ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులతో మాట్లాడుతున్న గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని పలు ఇంటర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు తమ మద్దతు తెలిపారు. వారు అమర్‌నాథ్‌ను మిందిలోని ఆయన నివాసంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యావంతుడు, పరిశ్రమలు, ఐటీ, పెట్టుబడుల శాఖ మంత్రిగా ఎంతో అనుభవం ఉన్న యువకుడిగా పరిపాలనలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అటువంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే, గాజువాకలోని విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని, అందుకే సంఘీభావం తెలియజేస్తున్నామని చెప్పారు. మిందికి చెందిన అధ్యాపకుడు గుడివాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎం.పి.రాజశేఖర్, ఎస్.రామకృష్ణ, ఎస్.నారాయణ, దీను ప్రకాష్, ప్రశాంత్, శ్రావణి, భవాని, సంతోషి, ఢిల్లీ రావు, సింహాద్రి, గణేష్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606
సాక్షి

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచార పర్వం



87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీ దుగ్గపువానిపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ప్రగడ వేణుబాబు, ఎన్నేటి రమణ, ముద్దపు దామోదర్, వెంకటరమణ తదితరులు - అగనంపూడి



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరుతూ భెల్ (హెచ్‌పీవీపీ) పరిసర ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ తదితరులు - అక్కిరెడ్డిపాలెం



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ వై.వరలక్ష్మి, 78వ వార్డు నాయకుడు సాపే బ్రహ్మయ్య నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ప్రచారం చేస్తున్న కార్యకర్తలు - ఉక్కునగరం

అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ పైపులు దగ్ధం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గెడ్డ పక్కన శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పెదగంట్యాడ అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాలివి.. నడుపూరు ప్రధాన గెడ్డ పక్కన గ్యాస్ లైన్ కోసం ఉంచిన ప్లాస్టిక్ పైపుల పక్కన, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో గాలికి నిప్పురవ్వలు ఎగిరి పైపులపై పడడంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో, అగ్నిమాపక దళ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

బీజేపీతో జత కట్టిన టీడీపీ ప్లాంట్‌ను రక్షిస్తుందా?

- 'ఉక్కు' ఉద్యోగులు ఆలోచించి ఓటేయాలి
- వైఎస్సార్ సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి



స్టీల్‌ప్లాంట్ నాయకులతో వైఎస్సార్ సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు దేవన్‌రెడ్డి

ఉక్కునగరం: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విషయంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ గాజువాక అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఉక్కునగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామన్న బీజేపీతో జతకట్టిన టీడీపీ ప్లాంట్‌ను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీతో ఎంతో సన్నిహితం అని చెప్పుకొనే పవన్ కల్యాణ్ వారికి చెప్పి ఎందుకు ప్రైవేటీకరణ ఆపించలేక పోయారన్నారు. కూటమిని గెలిపిస్తే ప్రైవేటీకరణ ముందుకు సాగుతుంది తప్ప, ఆగే ప్రస్తక్తి లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు గత మూడేళ్లుగా వైఎస్సార్‌సీపీ అనేక రకాలుగా ప్రయత్నిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే ప్రైవేటీకరణ ఆపిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వార్డు ఇన్‌చార్జి రావాడ శివ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎన్.రమేష్‌కుమార్, కె.అమ్మాజీ, కె.ప్రవీణ్, బిషాయ్, బాలయోగి, సత్యనారాయణ, మహాలక్ష్మి నాయుడు, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.